## నూతన పీఆర్సీలో కనీస వేతనం నిర్ణయించాలి

కామారెడ్డి, జూన్ 26 : నూతన పీఆర్సీలో కనీసం వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, ఎస్ఎంఆర్, ఫిక్స్‌పే తదితర పద్ధతుల్లో ఉద్యోగులు కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. పట్టణాలు, నగరాల్లో ప్రజల ఆరోగ్యంపై నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ సిబ్బంది అడుగడుగునా వివక్షకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించబోయే రెండో పీఆర్సీలో కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఆదివారం సెలవులు, పండుగ దినాలు సెలవు, ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు


టీఎన్జీవోస్ సభ్యత్వం తీసుకుంటున్న ఉద్యోగులు

కామారెడ్డి, జూన్ 26 : టీఎన్జీవోస్ కేంద్ర సంఘం పిలుపు మేరకు కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిలా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని ఉద్యోగులు టీఎన్జీవోస్ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాయిలు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్‌కుమార్, నాయకులు మనోజ్‌కుమార్, శివకుమార్, కిషన్, జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్

కామారెడ్డి, జూన్ 26 : విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలు విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం 25 శాతం సీట్లు బలహీనవర్గాల పిల్లలకు ఇవ్వకుండా చట్టాన్ని నీరుకార్చుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే 25 శాతం సీట్లు ఇచ్చేలా ప్రైవేట్ పాఠశాలలకు ఆదేశాలు జారీ చేసి బలహీనవర్గాల పిల్లలకు అడ్మిషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల కష్టాన్ని ప్రైవేట్ సంస్థలు దోచుకుంటున్నాయని తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు రామస్వామి, మండల అధ్యక్షుడు బసవరాజు సారయ్య, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలతో జీవితం నాశనం

### ఎస్పీ సింధు శర్మ


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి/ఎల్లారెడ్డి/కామారెడ్డి రూరల్, బిచ్కుంద/బాన్సువాడ, జూన్ 26 : యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని ఎస్పీ సింధు శర్మ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని సాందీపని జూనియర్ కళాశాల వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. కొత్త బస్టాండ నుంచి ర్యాలీ నిజాంసాగర్ చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస కావొద్దన్నారు. ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎవరైనా మాదకద్రవ్యాలు స్వీకరించిన, రవాణా చేసిన, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకుండా తల్లిదండ్రులు, అధ్యాపకులు దృష్టి సారించాలని చెప్పారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నియంత్రణ, వాటి వినియోగంతో కలిగే నష్టాలను వివరించారు. మాదకద్రవ్యాలు భవిష్యత్తులో వినియోగించబోమని అధికారులు, విద్యార్థులు ఫ్లెక్సీపై సంతకాలు చేశారు. మాదక ద్రవ్యాలు అత్యంత ప్రమాదకరమని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ అధికారి బావయ్య, డీఎస్పీ నాగేశ్వర్, సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, రామన్, మిషన్ పరివర్తన కమ్యూనిటీ ఎడ్యుకేటర్స్, ఎక్సైజ్, ఐసీడీఎస్ అధికారులు, ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, ఎస్సై మహేశ్, ఎక్సైజ్ సీఐ షాకీర్, పలువురు రెవెన్యూ అధికారులు, ఎస్సైలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో బాలుర ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నళిని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. బిచ్కుందలో సీఐ నరేశ్, ఎస్సై మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ తీశారు. బస్టాండ్ కూడలి వద్ద మానవహారం నిర్మించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సాయిలు, పాండురంగ్, మురళి, జీవన్, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు. బాన్సువాడలో లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి కుమారి టీఎస్పీ భార్గవి మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ మూర్తి, న్యాయవాదులు ఎంఎ ఖలీల్, రమాకాంత్‌రావు, మోహన్‌రెడ్డి, మొగులయ్య, దత్తాత్రేయ, సయ్యద్ హమీద్, ఎంఎ అజీమ్, పట్టణ సీఐ కృష్ణ, ఎస్సై జగన్నాథం, కోర్టు సిబ్బంది శ్యాం తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ శ్రీనివాస్


బిచ్కుందలో కాలేజీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసు అధికారులు



బాన్సువాడలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి కుమారి భార్గవి, సిబ్బంది

## పాఠశాలల బంద్ ప్రశాంతం

ఎల్లారెడ్డి/ గాంధారి/ లింగంపేట/మాచారెడ్డి/భిక్కనూరు/బాన్సువాడ టౌన్/బిచ్కుంద, జూన్ 26: ఏబీవీపీ పిలుపు మేరకు ఎల్లారెడ్డి, గాంధారి, లింగంపేట, మాచారెడ్డి, భిక్కనూరు, బాన్సువాడ, బిచ్కుందలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు బుధవారం బంద్ పాటించాయి. తెరిచి ఉన్న పాఠశాలలను ఏబీవీపీ నాయకులు మూసి వేయించారు. పలు పాఠశాలలు ముందుగానే సెలవు ప్రకటించడంతో విద్యార్థులు ఇండ్లకే పరిమితం అయ్యారు. ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేవరకు పోరాటాలు కొనసాగిస్తామని ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు.


లింగంపేటలో పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

## నేడు బస్వన్నపల్లిలో వైద్య శిబిరం

రాజంపేట్, జూన్ 26 : రాజంపేట మండలం బస్వన్నపల్లి గ్రామంలో గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో 60 ఏండ్లు పైబడినవారికి, దివ్యాంగుల కోసం మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సభ్యులు యోగ రాంరెడ్డి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, సెక్రటరీ బాస రఘుకుమార్, డాక్టర్ నరసింహా తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి పోటీలకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, జూన్ 26 : కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 8, 9వ తరగతి విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, కవితా రచనలు జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు జిల్లా కేంద్రంలోని భవిత హైస్కూల్‌లో ఈ నెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొను వారు పోస్టర్ మేకింగ్ థీమ్ 'భూముల పునరుద్ధరణ, కాలుష్య కోరల్లో నేటి మానవ మనుగడ' అనే అంశంపై కవితా రచనలు ఉంటాయని తెలిపారు. దీంట్లో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డిని లేదా 9440414250 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## బాధితుడికి ఎల్వోసీ అందజేత

మాచారెడ్డి, జూన్ 26 : మండలంలోని లచ్చాపేట గ్రామానికి చెందిన జక్కుల జ్యోతికి ఆపరేషన్ నిమిత్తం రూ.రెండు లక్షల 50 వేల ఎల్వోసీని బీజేపీ సీనియర్ నాయకుడు బూస సురేశ్ బుధవారం అందజేశారు. జ్యోతి అనారోగ్య సమస్యతో బాధపడుతున్నదని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి విన్నవించగా వెంటనే స్పందించి ఎల్వోసీని మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బూస ప్రభాకర్, చల్ల లింగం, బుస అనిల్, చల్ల ఎల్లం, స్వామి, భూపతి, ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 29న కామారెడ్డి సంత వేలం

కామారెడ్డి, జూన్ 26 : కామారెడ్డి సంతను 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను ఈ నెల 29వ తేదీ ఉదయం 11 మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి 31 మార్చి 2025 వరకు తైబజార్, మేకలు, పశువుల సంతకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం కాలపరిమితి తొమ్మిది నెలలు ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.50 వేలు డిపాజిట్ చేయాలని, రెండు ఖాళీ చెక్కులు ఇవ్వాలని సూచించారు.

## ఎన్‌సీసీ సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లతో ఎన్‌సీసీ కెడెట్లు

భిక్కనూరు, జూన్ 26 : మండలంలోని పెద్దమల్లారెడ్డిలో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్‌సీసీ సర్టిఫికెట్లును ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నదేవి, ఎంపీటీసీ సాయాగౌడ్ బుధవారం అందజేశారు. అనిల్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులను పరిష్కరించాలి

### ఎస్పీ సింధు శర్మ


పోలీసు అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సింధుశర్మ

ఎల్లారెడ్డి, జూన్ 26: ఎల్లారెడ్డి సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ సింధుశర్మ అన్నారు. ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన పోలీసు అధికారుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 2016కు ముందు నమోదైన కేసులు కోర్టు పరిధిలో విచారణ పూర్తి అయ్యేవిధంగా చూడాలన్నారు. జూలై మొదటి నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వస్తున్నందున వాటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సబ్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. న్యాయస్థానంలో విచారణలో ఉన్న కేసులకు పోలీసులు పూర్తిగా సహకరించాలని, సాక్షుల హాజరుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్, ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, ఆయా మండలాల ఎస్సైలు పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కారానికి బోర్లు


బోరు వేయిస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డి, జూన్ 26: మండలంలోని అన్నాసాగర్‌లో బుధవారం బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. గ్రామంలోని 7,9వ వార్డుల్లో నీటి సమస్యను పరిష్కరించడానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాలతో రెండు బోర్లు వేయించామని ఎంపీటీసీ ఉమాదేవీ గురుప్రతాప్ తెలిపారు. గ్రామస్తులు రామాగౌడ్, గంగారెడ్డి, దుర్గయ్య, కాశీరాం తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

### ఐకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వకుళాదేవి


సమావేశంలో మాట్లాడుతున్న ఐకేపీ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ వకుళాదేవి

నాగిరెడ్డిపేట, జూన్ 26: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యమని, రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు జీవనోపాధి కల్పించి కోటీశ్వరులను చేసేలా ముందుకు సాగాలని ఐకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వకుళాదేవి అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మహిళా సంఘాల సభ్యులతో బుధవారం ఏర్పాటు చేసిన ఆమె మాట్లాడారు. మహిళాశక్తి పథకం ద్వారా మహిళలకు మైక్రో ఎంటర్‌ప్రైజెస్, పాడి పశువులు, కోళ్ల పెంపకం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు తదితర వ్యాపారాలను ఏర్పాటుచేసి రుణాలను అందిస్తామని తెలిపారు. పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, జీవనోపాధుల ఏపీవో రాజేందర్, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ కిరణ్, నాగిరెడ్డిపేట ఏపీఎం జగదీశ్ కుమార్, సీసీలు దత్తు, నారాయణ, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సుజాత, రాజు, రవి, ఆయా గ్రామాల వీఏవోలు పాల్గొన్నారు.


పాదపూజ నిర్వహిస్తున్న విద్యార్థులు

## పాదపూజ

**గిద్ద ఉన్నత పాఠశాలలో బుధవారం తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 70 మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో పీఈటీ శ్రీనివాస్‌తోపాటు రాజేశ్వర్, విష్ణు, మహేశ్, స్వప్నప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.**

*- రామారెడ్డి, జూన్ 26*

## అడ్లూర్ ఎల్లారెడ్డిలో రైతులకు ఉచిత వైద్య శిబిరం

రామారెడ్డి, జూన్ 26: సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో యశోద దవాఖాన ఆధ్వర్యంలో బుధవారం రైతులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా అడ్లూర్ ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని ఆయా గ్రామాల రైతులకు ఉచితంగా పరీక్షలు చేశారు. శిబిరాన్ని సొసైటీ చైర్మన్ సదాశివారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ మేనేజర్ రత్నాకర్‌తోపాటు డైరెక్టర్లు గొల్లపల్లి లక్ష్మాగౌడ్, బత్తుల రామిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శంకర్, రాజేందర్‌రెడ్డి, యశోద దవాఖాన వైద్య బృందం పాల్గొన్నారు.


పేర్లు నమోదు చేయించుకుంటున్న రైతులు

## ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ


రోగిని పరీక్షిస్తున్న మెడికల్ ఆఫీసర్

రామారెడ్డి, జూన్ 26: మండలంలోని పోసానిపేట్ గ్రామంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని మండల మెడికల్ ఆఫీసర్ పురేశ్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో గర్భిణులకు తరచూ పరీక్షించి అవసరం ఉన్న సేవలను అందించాలని ఏఎన్ఎం భువనేశ్వరికి సూచించారు. చిన్నారులకు టీకాలు వేయాలని, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయనతోపాటు హెచ్ఈ భీమ్ ఉన్నారు.

## అంగన్‌వాడీ సెంటర్లలో గ్రోత్ మేళా

రామారెడ్డి/ నాగిరెడ్డిపేట, జూన్ 26: రామారెడ్డితోపాటు పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో బుధవారం గ్రోత్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఎత్తు, బరువును ఆన్‌లైన్‌లో నమోదు అప్‌లోడ్ చేస్తున్నారు. గ్రోత్‌మేళాను ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ సిబ్బంది తెలిపారు. పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్, ఏఎన్ఎంలు మహేశ్వరి, లింబవ్వ, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, శోభ, అనసూయ, మంగమ్మ, సుధ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. చిన్నారులకు పోషకాహారం అందించాలని బస్తీ దవాఖాన వైద్యురాలు అపర్ణ అన్నారు. తాండూర్‌లో అంగన్‌వాడీ కార్యకర్త మరియ, ఏఎన్ఎం ఏసుమణి, ఆశవర్కర్ మారుత పాల్గొన్నారు.

## రేపు క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

కామారెడ్డి, జూన్ 26 : జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో 28న క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు సాందీపని విద్యా సంస్థల డైరెక్టర్ హరిస్మరణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సాయిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీలైన జీవీకే ఎంటర్‌ప్రైజెస్, ఎయిర్‌టెల్, పేమెంట్స్ బ్యాంక్, వరుణ్ గ్రూప్ వివిధ ఉద్యోగాల కోసం జాబ్‌మేళాను తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ నిర్వహిస్తున్నదని తెలిపారు. ఏదైనా డిగ్రీ పాస్ అయిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తీసుకొని శుక్రవారం ఉదయం 9 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, CHITTALA DEVENDHAR .H.No: 1-32/17 ,Choutpally, Kammarpally (M), Nzb (D) Changed My surname/ Name As CHITYALA DEVENDHAR S/O CHITYALA RAJANNA.
NTZ-340065

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


నోటుబుక్కులను పంపిణీ చేస్తున్న గోవింద్

## విద్యార్థులకు నోటుబుక్కులు పంపిణీ

మద్నూర్, జూన్ 26: మండలకేంద్రంలోని పోచమ్మగల్లి, రథం గల్లి ప్రాథమిక పాఠశాలలతోపాటు అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు బుధవారం నోటు బుక్కులను పంపిణీ చేశారు. హోంగార్డు గోవింద్ ఆయా పాఠశాలలకు చెందిన మొత్తం 75మంది విద్యార్థులకు నోటు బుక్కులతోపాటు పెన్నులు, పెన్సిళ్లు, పలకలను అందజేశారు. అతడు కొన్నేండ్లుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడంపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు సునీల్, శివరాం, సురేశ్, రాజేందర్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీపీ మాధవి

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 26: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి అన్నారు. మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని గ్రామాల్లో సర్వే చేయించాలని, వానకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జడ్పీటీసీ ఉషాగౌడ్, డాక్టర్ శరత్, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయాలను సందర్శించిన దేవాదాయ శాఖ అధికారులు

ఎల్లారెడ్డి, జూన్ 26: పట్టణంలోని పలు ఆలయాలను దేవాదాయ శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. ఎల్లారెడ్డిలోని శ్రీ రాముని, వేణు గోపాల స్వామి ఆలయాలను పరిశీలించిన జిల్లా దేవాదాయ శాఖ అధికారిణి కమల.. ఆయా ఆలయాల పరిధిలో ఉన్న భూముల వివరాలను సేకరించినట్లు తెలిసింది. ఆమెవెంట సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయ ఈవో వేణు, పలువురు స్థానిక పూజారులు ఉన్నారు.


ఎల్లారెడ్డిలోని రామాలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు